క్లుప్తంగా

పాఠశాలను కొనసాగించాలని వినతి


ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

హిరమండలం: చొర్లంగి ప్రాథమిక పాఠశాలలోనే 3, 4, 5 తరగతులు కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల నేపథ్యంలో చొర్లంగి పాఠశాలను తుంగతంపర కాలనీలో సర్దుబాటు చేస్తారని తెలుస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. చొర్లంగిలోనే పాఠశాలను కొనసాగించాలని తీర్మానించారు. ఇదే విషయంపై ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థులు

సరుబుజ్జిలి: అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందినప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని బూర్జ ఐసీడీఎస్ పరిధి రొట్టవలస సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.జానకి తెలిపారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని రొట్టవలసలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వడదెబ్బపై అప్రమత్తం


హోమియో మందులు పంపిణీ చేస్తున్న వైద్యురాలు

సారవకోట: ప్రస్తుతం ఉష్ణోగ్రత తీవ్రత పెరుగుతోందని, వడదెబ్బ తగిలే ప్రమాదముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చీడిపూడి హోమియో వైద్యురాలు అనుజ్ఞ సూచించారు. చీడిపూడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం అవగాహన కల్పించారు. హోమియో మందులు పంపిణీ చేశారు. బయటకు వెళ్లేటప్పుడు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం పాటోజు శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం..


ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

జలుమూరు: సైరిగాం పంచాయతీలోని చెరువుల ఆక్రమణలపై జిలా కలెక్టర్‌కు గ్రామ సర్పంచ్ ధర్మాన అనితతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. పాపప్ప, బూసప్ప,అచెప్ప కోనేర్లను, ఊరుగుండం చెరువును మంగళవారం పరిశీలించారు. మండల సర్వేయర్‌తోపాటు వీఆర్వో, విలేజ్ సర్వేయర్, తదితరులు బృందంగా ఏర్పడి మరోసారి ఆక్రమణలు పరిశీలించిన తరువాత నివేదికలు సిద్ధం చేస్తారన్నారు. మండల సర్వేయర్ నాగేశ్వరరావు, వీఆర్వో రామారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యంత్రాలను వినియోగించుకోవాలి


వ్యవసాయ పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

బూర్జ: వ్యవసాయశాఖ ద్వారా రైతు కమిటీలకు రాయితీపై ఇచ్చిన వ్యవసాయ యంత్ర పరికరాలను రైతుల వినియోగించుకోవాలని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.మధులేటి అన్నారు. బూర్జ మండలంలోని అల్లెన, చినలంకాం, నీలాపురం, పాలవలస గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఇప్పటికే రైతు సంఘాల ద్వారా తీసుకున్న యంత్రాల వినియోగం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయా యంత్రాలను పరిశీలించారు. ఏఓ ఎస్.శ్రీనివాసరావు, వి.సురేష్, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల బాదుడు

- కూటమి నాయకుల హామీలు గాలికి..
- అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలు
- పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజల అవస్థలు



సారవకోట: కూటమి నాయకులు ఇచ్చిన హామీలకు, వారు చేస్తున్న పాలనకు పొంతన లేదు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల ప్రచార సభల్లో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఎటువంటి ప్రకటనలు చేయకుండా విద్యుత్ చార్జీలను పెంచారు. ఈ విద్యుత్ చార్జీలను శీతాకాలంలో ప్రజలు గుర్తించలేరని గమనించి అమాంతం పెంచారు. వేసవి మొదలు కాగానే విద్యుత్ బిల్లులు అధికంగా రావడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. విద్యుత్ వినియోగం అయ్యే ఖర్చు కాకుండా.. అదనపు చార్జీల పేరుతో బిల్లులను అమాంతం పెంచేసింది.

పేదలపై భారం..

సారవకోట గ్రామంలో గతంలో విద్యుత్ బిల్లు రూ.120 చెల్లించే సాధారణ, పేద కుటుంబాల వారు.. ప్రస్తుతం రూ.300 వరకు చెల్లించాల్సి వస్తోంది. వేసవిలో విద్యుత్ వినియోగం పెరగడం ఒక ఎత్తు అయితే.. విద్యుత్ వినియోగం కాకుండా అదనపు చార్జీల పేరుతో మరో రూ.60 నుంచి రూ.70 వరకు చార్జీలు పెంచడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన ప్రభుత్వ పెద్దలు.. ఇప్పుడు అదనపు చార్జీల పేరుతో పేదల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది వినియోగదారులకు ఏప్రిల్ విద్యుత్ బిల్లులు రూ.300 నుంచి రూ.500 వరకు పెరిగినట్లు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్ చార్జీలు పెంచారని ఆరోపిస్తున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో వివిధ కేటగిరీల విద్యుత్ కనెక్షన్లు..					
మండలం	నరసన్నపేట టౌన్	నరసన్నపేట రూరల్	పోలాకి	జలుమూరు	సారవకోట
విద్యుత్ కనెక్షన్లు	15,928	15,316	22,291	16,877	15,926

ప్రతి నెలా రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల భారం..

నరసన్నపేట నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో 83,338 విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఈ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడం వలన సరాసరిగా రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ప్రతినెలా ప్రజలపై భారం పడుతోంది. ఒక ప్రక్క మార్కెట్లో నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతుండగా.. మరోవైపు పెంచిన విద్యుత్ చార్జీలతో సామాన్యుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పేదలపై ఆర్థిక భారం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెంచిన విద్యుత్ చార్జీలతో పేదలపై ఆర్థిక భారం పెరిగింది. ఒకపక్క నిత్యావసరాలు పెరుగుతుంటే వాటిని నియంత్రించే చర్యలు చేపట్టం లేదు. దీనికి తోడు విద్యుత్ చార్జీలు అమాంతంగా పెంచడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– నక్క తులసీదాస్, వైఎస్సార్ పార్టీ నాయకులు, బుడితి, సారవకోట మండలం

అమాంతం పెంచేశారు



వేసవిలో విద్యుత్ బిల్లులు తీసేటప్పుడు అర్థమైంది. విద్యుత్ చార్జీలు గతం కంటే అమాంతం పెరిగాయి. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని కూటమి నాయకులు చెప్పారు. ఇప్పుడు చార్జీలు అమాంతం పెంచడంతో చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నాం.

– కొండాల ఢిల్లమ్మ, మాజీ సర్పంచ్, పెద్దలంబ, సారవకోట మండలం

పంచాయతీల నిధులు పక్కదారి

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గ్రామాలాభివృద్ధి కోసం పంచాయతీలకు వచ్చిన నిధులు పక్కదారి పట్టాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. దేశానికి పంచాయతీలే పట్టుగొమ్మలని వేదికలపై ఊదరగొట్టే.. పాలకులే పంచాయతీల అభివృద్ధిని పక్కన పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న నిధులను.. ఇతర ఖర్చుల కోసం చంద్రబాబు ప్రభుత్వం దారి మళ్లిస్తోందన్నారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.1,121.20 కోట్లు ఆయా సంస్థలకు జమ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలలుగా దారి మళ్లించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సర్పంచ్‌లకు గౌరవ వేతనం కూడా చెల్లించడం లేదన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీల్లో నిధులు లేకుండా పోయాయని అనేక మంది సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా వైఎస్సార్‌సీపీకి చెందినవారే ప్రజాప్రతినిధులుగా ఉన్నారన్నారు. వీరిని అణిచివేసేందుకే చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. అందుకే నిధులు విడుదల చేయకుండా అనేక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.

తాగునీటికి కటకట

నరసన్నపేట: మేజరు పంచాయతీలోని మారుతీనగర్-5 వీధితోపాటు పరిసర వీధుల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వారం రోజులుగా కుళాయిలు ద్వారా నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ వీధి వాసులు తెలిపారు. పంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎప్పటికప్పుడు ఈ విధంగా నీరురావడం లేదన్నారు. శాశ్వత పరిష్కారం చూపి, రోజూ కుళాయిల ద్వారా నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమ తవ్వకాలు గుర్తింపు

సారవకోట: మండలంలోని జమచక్రం నుంచి గొల్లపేట వెళ్తున్న రోడ్డులో (కొండ) అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని సాక్షిలో మంగళవారం వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వీఆర్వో రాము సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్రమంగా గ్రావెల్ తరలించినట్లు గుర్తించారు. దీనిపై తహసీల్దార్‌కు నివేదిక అందించనున్నట్లు వీఆర్వో తెలిపారు.


కొండను పరిశీలిస్తున్న వీఆర్వో

ఉపకరణాల వితరణ



సారవకోట మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రత్యేకావసరాల గల పిల్లలకు ఎంఈఓలు ఎం.వి.రమణ, భూలక్ష్మి మంగళవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. అల్మికో సంస్థ తమ సామాజిక న్యాయం కార్యక్రమంలో భాగంగా భవిత కేంద్రంలో ఉన్న 16 మంది పిల్లలకు ఉపకరణాలు అందజేసినట్లు ఎంఈఓలు తెలిపారు. హెచ్‌ఎం అప్పన్న, సహిత ఉపాధ్యాయులు శ్రీసంధ్య, పూర్ణిమ ఉన్నారు. - సారవకోట

ఆందోళన



పొందూరు ఎంఈఓ కార్యాలయం ఎదుట మండలంలోని భగవానుదాసుపేట ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానంలో భాగంగా భగవానుదాసుపేట పాఠశాలను ఎత్తివేసి నరసాపురం మోడల్ ప్రాథమిక పాఠశాలలో కలిపారని, ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎంఈఓకు వినతిపత్రం అందించారు. నరసాపురం పాఠశాలకు వెళ్లే రోడ్డు చిలకపాలెం-పొందూరు ప్రధాన రహదారి కావడంతో భారీ వాహనాలు, బస్సులు నిత్యం తిరుగుతూ ఉంటాయని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. అలాగే లైదాం ఎంపీయూపీ పాఠశాలను ప్రైమరీ పాఠశాలగా స్థాయి తగ్గించడంపై ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలియజేశారు. - పొందూరు

వైభవంగా మహాయజ్ఞం



సరుబుజ్జిలి మండలం రొట్టవలస రామానందాశ్రమంలో తారకరామ మహాయజ్ఞం మంగళవారం నిర్వహించారు. ఆశ్రమం ఆవరణలో హోమాలు, శ్రీరామకోటి స్థూపప్రతిష్ఠ చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం వ్యవస్థాపకులు తొత్తడి వెంకటరమణస్వామి, ఆశ్రమ కమిటీ సభ్యులు తొత్తడి వైకుంఠరావు, తొత్తడి రమేష్ బాబు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు. - సరుబుజ్జిలి

స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాల పంపిణీ



మెళియాపుట్టి మండలం కరజాడ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను హెచ్‌ఎం వెంకటరావు మంగళవారం ఉచితంగా అందించారు. ఈ పుస్తకాన్ని రూపొందించిన ఆంగ్ల ఉపాధ్యాయులు వెంకటాచలం, శ్రీనివాసరావును అభినందించారు. భవిష్యత్‌లో ఇంగ్లిష్ మాట్లాడటం చాలా అవసరమని హెచ్‌ఎం అన్నారు. ఉపాధ్యాయుడు వెంకటాచలం మాట్లాడుతూ.. తోటి విద్యార్థులతో ప్రతిరోజూ మాట్లాడే పదాలు, నిత్యం అవసరమయ్యే మాటలతో 'వాక్ ఫర్ ఇంగ్లిష్' పేరుతో పుస్తకాన్ని రూపొందించామన్నారు. - మెళియాపుట్టి

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

పాతపట్నం: సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి అన్నారు. ఇంటర్న్‌షిప్ చేసిన విద్యార్థులకు మంగళవారం ధ్రువపత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల సెలవు రోజుల్లో పలువురు విద్యార్థులు.. వృత్తి విద్యలో భాగంగా కంప్యూటర్, ఆటోమోటివ్ కోర్సులు నేర్చుకున్నారన్నారు. మీ-సేవ, రేషన్ కార్డుల తయారీ, ఫ్లెక్సీల తయారీ వంటివి కంప్యూటర్ విద్యలో భాగమన్నారు. తల్లిదండ్రులు వృత్తి విద్యా కోర్సులను ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రత్నకుమారి

సందడే.. సందడి..

ఆమదాలవలస: స్థానిక ఎస్‌వీఎస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో కరస్పాండెంట్ పేడాడ ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ కలయిక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలతో సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ.. ఆమదాలవలసలో డిజిటల్ లైబ్రేరీని ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, విద్యాసాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

వై.ఎస్.జగన్‌ను కలిసిన గుమ్మడి


వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో రాంబాబు

ఆమదాలవలస: మాజీ సీఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని ఆమదాలవలస మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు గుమ్మడి రాంబాబు మంగళవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించినట్లు రాంబాబు తెలిపారు.

చెరువులను రక్షించండి

జలుమూరు: సైరిగాంలోని పాపమ్మ కోనేరు, భూసమ్మ కోనేరు, ఉప్పరవాని చెరువు, మంగళ చెరువు, గాది బంద, ఊరుగుండం చెరువు, సోమనాథ, అచ్చెప్ప, తదితర చెరువులను రక్షించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం పాపమ్మ కోనేరు వద్ద అల్లాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పొన్నాడ ముసలినాయుడు, కొర్ను సత్యనారాయణ, ధర్మాన వెంకటరమణమూర్తి, రామకృష్ణ, ముద్దాడ సింహాచలం, పొన్నాన శ్రీరాములు, వెంకటరమణ, తదితరులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన ముద్దాడ రవిచంద్ర ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్నత స్థానంలో ఉండడంతో ఆయన సోదరుడు శ్రీనివాసరావు చెరువులను ఆక్రమించారన్నారు.

పేద రైతులకు ఇబ్బంది పెట్టడం, అదే చెరువు కింద ఉన్న అతని పంట పొలాల విస్తీరణం పెరిగేలా ఆక్రమణలు చేస్తున్నాడన్నారు. ఎస్సీ, బీసీలకు చెందిన డీపట్టా భూముల్లోనూ యంత్రాలతో తవ్వకాలు జరిపి, తమ పొట్ట కొడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణపై అధికారులు స్పదించి న్యాయం చేయాలని పలువురు రైతులు కోరారు.


పాపమ్మ కోనెరు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఘనంగా ధరిత్రీ దినోత్సవం


పాతపట్నం: ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో గ్లోబ్‌ను పెట్టుకుని ప్రదర్శిస్తున్న విద్యార్థులు


పాతపట్నం: పాతపట్నం ఉన్నత పాఠశాలలో గ్లోబ్‌తో విద్యార్థినులు

పొందూరు: ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని తాడివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం బల్ల కంటయ్య, విద్యార్థులు మొక్కలు నాటారు. నేషనల్ గ్రీన్ కోర్ కోఆర్డినేటర్ పూజారి హరిప్రసన్న మాట్లాడుతూ విద్యార్థులు తమ పుట్టిన రోజున ఒక మొక్కను నాటాలని కోరారు. ఉపాధ్యాయులు రావాడ పాపారావు, సాయికుమార్ పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని, వాటిని సంరక్షించాల్సి బాధ్యతను కూడా తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి అన్నారు. మోడల్ స్కూల్, పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్నకుమారి, హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు మాట్లాడుతూ.. భూమిని ఎలా కాపాడాలనే దానిపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఉపాధ్యాయులు అప్పలరాజు, తారకేశ్వరరావు పాల్గొన్నారు.



పొందూరు: మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం, విద్యార్థులు

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు

హిరమండలం: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించిందని ఎంఈఓ-2 సి.హెచ్.తిరుమలరావు మంగళవారం తెలిపారు. పేద విద్యార్థులకు ఉచితంగా ఒకటో తరగతిలో ప్రవేశాలకు విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు. ముఖ్యంగా అనాథ బాలలు, హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు, పేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలన్నారు. ఆయా ప్రైవేట్ పాఠశాలల్లోనే ఆన్‌లైన్ చేస్తారని, మరిన్ని వివరాలకు మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ఉపకరణాల అందజేత

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో 13 మంది ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఆలిమ్‌కో సంస్థకు చెందిన ప్రతినిధులు వీల్ చైర్లు, కమోట్, ట్రైసైకిళ్లు, ఎల్బో స్టిక్స్, తదితర ఉపకరణాలను మంగళవారం పంపిణీ చేశారు. ఇంతకుముందు నిర్వహించిన వైద్య నిర్ధారణ శిబిరంలో గుర్తించిన ప్రత్యేక అవసరాల పిల్లలకు వీటిని అందజేసినట్లు ఎంఈఓలు దేవేంద్రరావు, పద్మనాభరావు తెలిపారు. హెచ్‌ఎం గణపతిరావు, పీఎంసీ చైర్మన్ చినబాబు, సహిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపకరణాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓలు, సంస్థ ప్రతినిధులు

నవధాన్యాల సాగుతో కలుపు నివారణ

కొత్తూరు: వరి వెదలు సాగు చేస్తున్న భూమిలో ముందుగా నవధాన్యాలు సాగు చేయడం వలన కలుపు నివారణ జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి స్వర్ణలత అన్నారు. మండలంలోని పారాపురంలో నవధాన్యాల కిట్లును ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో తయారు చేయించి పంపిణీ చేశారు. ఒక్కో కిట్‌లో పెసర, మినుము, నువ్వులు, తోటకూర, గోంగూరతోపాటు పలు రకాల విత్తనాలు (2,150 గ్రాములు) ఉంటాయన్నారు. ఈ కిట్లు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కిట్ ధర రూ.200 నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కిట్లు వినియోగించడం వలన భూమిలో సూక్ష్మజీవులు పెరగడంతోపాటు సారవంతంగా ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ఎంటీ సవర సూర్యనారాయణ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పారాపురంలో కిట్లు పంపిణీ చేస్తున్న ఏఓ స్వర్ణలత